సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల జెఎసి డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్రప్రభుత్వాన్ని కోరింది. జెఎసి సమావేశం విజయవాడలో గురువారం జరిగింది. నూతన వేతన సవరణ, పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఎలు, 2004 వరకు నియమితులైన ఉద్యోగులకు ఒపిఎస్ అమలు వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం అవలంబిస్తున్న నిర్లక్ష్య, ఉదాసీన వైఖరిపై జెఎసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. న్యాయమైన సమస్యలను ఎటువంటి జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు మొదటి వారంలో యాజమాన్యానికి సమగ్ర లేఖ పంపాలని సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఆగస్టు నెలాఖరు నాటికి రాష్ట్రంలోని అన్ని డిస్కమ్‌లు, జిల్లా స్థాయిలో జెఎసి కార్యవర్గాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అనంతరం పరిస్థితిని సమీక్షించి విద్యుత్ ఉద్యోగుల సమస్యల సాధన కోసం అవసరమైన కార్యాచరణ రూపొందించాలని తీర్మానించింది.

'ఇంటింటికి టిడిపి'లో 9 లక్షల ఇళ్ల సందర్శన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరించేందుకు టిడిపి చేపట్టిన 'ఇంటింటికి తెలుగుదేశం-2026' కార్యక్రమం నాలుగో రోజూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగింది. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి, కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారని టిడిపి కార్యాలయం గురువారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. గురువారం నాలుగో రోజు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.80 లక్షల ఇళ్లను శ్రేణులు సందర్శించారని తెలిపింది. మొత్తం నాలుగు రోజుల్లో 9 లక్షల ఇళ్లను సందర్శించి పథకాల అమలును తెలియజేశారని పేర్కొంది. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల్లో విశేష ఆదరణ పొందుతున్న నాయకులు, కార్యకర్తలను పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తున్నారని తెలిపింది. ఉత్తమ పనితీరు కనబరుస్తున్న వారికి వ్యక్తిగతంగా ఎస్ఎంఎస్ సందేశాలు పంపి అభినందించినట్లు వివరించింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు ఉండటం, రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా కొద్ది చోట్ల 'ఇంటింటికి తెలుగుదేశం-2026' కార్యక్రమం నిర్వహించలేకపోయారని పేర్కొంది.

భవన నిర్మాణ నిబంధనలలో సంస్కరణలు

- టిడిఆర్ వినియోగంలో సడలింపులు
- అగ్నిప్రమాద ఎన్ఓసి లేకపోయినా నిర్మాణం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భవన నిర్మాణ నిబంధనలలో ప్రభుత్వం సంస్కరణలు తీసుకువచ్చింది. విడతలవారీగా ఫైర్ క్లియరెన్స్‌లు ఇస్తే సరిపోతుందని పేర్కొంది. ఈ మేరకు పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ బుధవారం జిఓ ఇచ్చారు. ఈ జిఓలో టిడిఆర్ బాండ్ల వినియోగంలో మరింత సడలింపులు ప్రకటించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగు వేసిందని అందులో పేర్కొన్నారు. అవసరం లేని పద్ధతులు, నిబంధనల భారాన్ని తొలగిస్తూ సురక్షితమైన, సమ్మిళిత, పర్యావరణ రహిత పెట్టుబడులకు అనుకూలమైన నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించడమే ఈ సంస్కరణల ముఖ్య ఉద్దేశమని జిఓలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ కేబినెట్ 'డిరెగ్యులేషన్ సెల్' మార్గదర్శకాలకు అనుగుణంగా 23 ప్రాధాన్యత రంగాలు, 5 ఐచ్ఛిక ప్రాధాన్యత రంగాలను పరిగణనలోకి తీసుకుని ఈ సవరణలు రూపొందించినట్లు పేర్కొన్నారు. స్టిల్ట్ ఫ్లోర్‌తో కలిపి 24 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలను హైరైజ్ (ఎత్తైన) భవనాలు'గా నిబంధనలలో పేర్కొన్నారు. క్రెచ్‌లు (శిశు సంరక్షణ కేంద్రాలు), ఆధ్యాత్మిక/ప్రార్థనా మందిరాల భవనాలకు అధికారిక గుర్తింపును ఇచ్చారు. 10 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాల నిర్మాణ డిజైన్లు నేల మోసే సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, బిల్డర్లు డెవలపర్లు నిర్మాణ సమయానికి సంబంధించిన 'ఆల్ రిస్క్ ఇన్సూరెన్స్ పాలసీ'ని సమర్పించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. నివాస, నిర్మాణ రంగ కార్యకలాపాలకు ఊతమిచ్చేందుకు 'సిటీ-లెవల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంపాక్ట్ ఫీజు'ను మూడేళ్ల వ్యవధిలో ఆరు సమాన విడతలలో చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతించింది. గడువు ముగిసిన భవన అనుమతుల రీ-వాలిడేషన్ తో ఎలాంటి అనిశ్చితి లేకుండా మళ్లీ అనుమతుల ప్రక్రియ చేపట్ట వచ్చని వివరించారు. ఎలాంటి వాణిజ్య అవసరాలు లేకుండా, కేవలం ఆధ్యాత్మిక/ప్రార్థనా అవసరాల కోసం మాత్రమే ఉపయోగించే భవనాలకు భవన నిర్మాణ అనుమతి రుసుములు, ఇతర సంబంధిత ఛార్జీల నుంచి మినహాయింపు ఇచ్చారు. హైరైజ్ కాని భవనాలకు ప్లాట్ పరిమాణాన్ని బట్టి చిన్న ప్లాట్లకు ఇబ్బంది లేని విధంగా, పెద్ద నిర్మాణాలకు భద్రత, పార్కింగ్ అవసరాలను ప్రాధాన్యతగా ఉంచారు. ఎత్తైన భవనాల్లో (హైరైజ్) సెట్‌బ్యాక్‌లను నిర్ణయించడానికి భవన ఎత్తును లెక్కించేటప్పుడు ప్రత్యేక పార్కింగ్ అంతస్తులను మినహాయింపు ఇచ్చారు. ఫైర్ ఎన్ఓసి, ఎయిర్‌పోర్ట్ అథారిటీ క్లియరెన్స్, పర్యావరణ అనుమతులు, స్ట్రక్చరల్ డిజైన్ ఇతర చట్టబద్ధమైన భద్రతా అవసరాల కోసం వీటిని ఎత్తు కిందనే పరిగణించనున్నారు. స్టిల్ట్ ఫ్లోర్‌తో సహా 24 మీటర్ల ఎత్తు వరకు ప్రారంభ అనుమతి మంజూరు చేస్తారు. భవనం ఆ ఎత్తు దాటి నిర్మాణాన్ని కొనసాగించే ముందు దరఖాస్తుదారుడు ఫైర్ ఎన్ఓసీని సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతిపాదిత భవనానికి సంబంధించిన స్ట్రక్చరల్ డిజైన్, స్టెబిలిటీ పత్రాలను ముందే సమర్పించాలని, మిగిలిన అంతస్తులకు అనుమతి ఫైర్ ఎన్ఓసీ సమర్పించిన తర్వాతే ఇస్తారని పేర్కొన్నారు. ఈ విధానంలో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను సడలించారు. భవనాల ఎత్తును బట్టి రోడ్డు వెడల్పు, చుట్టూ ఉండాల్సిన ఖాళీ స్థలం (ఓపెన్ స్పేస్) నిబంధనల్లో మార్పు చేశారు. ఖాళీ స్థలం, అనుమతించదగిన బిల్ట్-అప్ ప్రాంతం దెబ్బతినకుండా స్థలంలో ఒకవైపు నుంచి మరోవైపునకు పరిమితంగా సెట్‌బ్యాక్‌లను మార్చుకోవడానికి అనుమతించారు. ఆరు మీటర్ల ఎత్తు నుంచి పైన ఉండే అంతస్తులలో నిబంధనలకు లోబడి రెండు మీటర్ల వరకు బాల్కనీ ప్రొజెక్షన్లకు అనుమతి ఉంటుందని అయితే, అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా ఉండాల్సిన భద్రతా చర్యలను బాల్కనీ కవర్ చేయడానికి వీల్లేదని పేర్కొన్నారు. 5,000 చదరపు మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ బిల్ట్-అప్ ప్రాంతం ఉన్న అన్ని కొత్త వాణిజ్య సముదాయాలు, హౌసింగ్ సొసైటీలు, రెసిడెన్షియల్ టౌన్‌షిప్‌లో ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ సదుపాయాలు కల్పించడం తప్పనిసరి చేశారు. 100 లేదా అంతకంటే ఎక్కువ యూనిట్లు ఉన్న గ్రూప్ హౌసింగ్ ప్రాజెక్టులలో క్రెచ్‌లు, క్లబ్ హౌస్‌లు, కన్వీనియంట్ షాపింగ్, జిమ్నాషియం వంటి ఉమ్మడి వసతుల కోసం స్థలాన్ని కేటాయించాలని తెలిపారు. 50 మందికి పైగా ఉద్యోగులున్న పెద్ద నివాస, విద్యా, వైద్య, వాణిజ్య, పారిశ్రామిక మరియు ప్రభుత్వ సంస్థలలో కూడా క్రెచ్ (శిశు సంరక్షణ) వసతి తప్పనిసరి చేశారు. కనీసం 10 అంతస్తులు ఉన్న ఎత్తైన భవనాలు గార్డెన్లు, వాకింగ్/జాగింగ్ ట్రాక్‌లు, వ్యూయింగ్ గ్యాలరీలు, వినోద సదుపాయాల కోసం 'ఎన్విరాన్‌మెంటల్ డెక్ ఫ్లోర్'ను ఏర్పాటు చేసుకోవచ్చని పెద్ద భవనాల్లో పైప్‌లైన్లు, ఇతర యుటిలిటీ లైన్ల నిర్వహణను సులభతరం చేసేందుకు 'సర్వీస్ ఫ్లోర్లకు' కూడా అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. అదనపు అంతస్తులు పరిమిత సెట్‌బ్యాక్ సర్దుబాట్ల కోసం ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ వినియోగాన్ని విస్తరించారు. ఇది రోడ్డు వెడల్పు, పార్కింగ్, ఎత్తు భద్రతా నిబంధనలకు లోబడి ఉండాలని, ప్రస్తుతం ఉన్న రోడ్డు వెడల్పు 9 మీటర్ల కంటే తక్కువగా ఉన్న చోట టిడిఆర్ అంతస్తులకు అనుమతి ఉండదని పేర్కొన్నారు.

రిలయన్స్ డేటా సెంటర్‌కు రైతుల భూములు ఇప్పట్లో తీసుకోం

- ప్రభుత్వ హామీతో కేసు ముగింపు

ప్రజాశక్తి, అమరావతి:

విజయనగరం జిల్లా భోగాపురం ప్రాంతంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రతిపాదించిన గిగా-స్కేల్ ఏఐ డేటా సెంటర్, కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ప్రాజెక్టుకు భూముల కేటాయింపును సవాలు చేస్తూ రైతులు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను హైకోర్టు పరిష్కరించింది. పిటిషనర్లకు చెందిన భూములను ఇప్పట్లో స్వాధీనం చేసుకోవడం లేదని, భవిష్యత్తులో అవసరం ఏర్పడితే చట్టబద్ధమైన భూసేకరణ ప్రక్రియ ద్వారా లేదా రైతుల సమ్మతితోనే భూములు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు హామీ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హాజరై, ఈ ప్రాజెక్టు కోసం ప్రస్తుతం ఏపీఐఐసీ ఆధీనంలోని భూములనే వినియోగిస్తున్నామని వివరించారు. ఈ హామీని నమోదు చేసిన జస్టిస్ చల్లా గుణరంజన్, ఈ దశలో వ్యాజ్యాన్ని కొనసాగించాల్సిన అవసరం లేదని పేర్కొంటూ పిటిషన్‌ను పరిష్కరించారు. రిలయన్స్ సంస్థకు 854.97 ఎకరాల భూమిని కేటాయిస్తూ జారీ చేసిన జీవోను సవాలు చేస్తూ భోగాపురం మండలానికి చెందిన రైతులు ఈ పిటిషన్ వేశారు. కేటాయించిన భూములకు సంబంధించిన సర్వే నంబర్లను జీవోలో పేర్కొనలేదని, చట్టపరమైన విధానాలు పాటించలేదని వారి తరఫు న్యాయవాదులు వాదించారు.

ఆర్ టిసి ఉద్యోగ సంఘాల జెఎసి సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర కన్వీనర్లు, కో కన్వీనర్లు తదితరులు

ఆర్‌టిసి పరిరక్షణకు మూడో దశ ఉద్యమం

- ఉద్యోగ సంఘాల జెఎసి ప్రకటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసిలో విద్యుత్ బస్సుల పేరుతో ప్రయివేటు ఆపరేటర్లకు అవకాశం కల్పిస్తూ వేలకోట్ల విలువైన ఆర్ టిసి డిపో స్థలాలను విద్యుత్ బస్సు ఆపరేటర్లకు లీజుపేరుతో కట్టబెట్టి దశలవారీగా ప్రయివేటు పరం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనలు విరమించుకోవాలని ఎపిపిటిడి (ఆర్‌టిసి) జెఎసి డిమాండ్ చేసింది. సంస్థ పరిరక్షణ, ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతం, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్ టిసి ఉద్యోగ సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టనున్న మూడవ దశ ఆందోళన కార్యక్రమాల షెడ్యూల్‌ను ప్రకటించారు. గురువారం విజయవాడ రెవెన్యూభవన్‌లో ఆర్ టిసి ఉద్యోగ సంఘాల జెఎసి రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జెఎసి కమిటీ తీసుకున్న నిర్ణయాల మేరకు మూడవ దశ ఆందోళన కార్యక్రమాల షెడ్యూల్‌ను దశలవారీగా ఉధృతం చేసేందుకు నిర్ణయించారు. జెఎసిగా చేపట్టిన రెండు దశలలో ఆందోళనల్లో విద్యుత్ బస్సుల పేరుతో ఆర్‌టిసిని ప్రైవేటు పరం చేయవద్దని, విద్యుత్ బస్సులన్నీ సంస్థ ద్వారానే నిర్వహించాలని కోరినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి సానుకూల స్పందన లేకపోవడంతో మూడవ దశ ఆందోళన కార్యక్రమాలకు సిద్ధపడుతున్నామని ప్రకటించారు. ఇప్పటికే వస్తున్న విద్యుత్ బస్సుల కోసం నాలుగు డిపోలను పూర్తిగా కూల్చివేసి ప్రయివేటు ఆపరేటర్లకు అప్పజెప్పారని, మరో 8 డిపోల్లో 50శాతం స్థలాలను ప్రయివేటు ఆపరేటర్లకు ఇస్తున్నారని తెలిపారు. ఇంకా రాబోతున్న 1,450 విద్యుత్ బస్సుల కోసం మరో 29 డిపోలను ప్రయివేట్ విద్యుత్ బస్సు ఆపరేటర్లకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం సిద్ధం చేస్తోందని విమర్శించారు. 2029 నాటికి ఆర్‌టిసిలో ఉన్న అన్నీ బస్సులు ప్రయివేటు వారికీ, డిపోలు కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఆర్‌టిసి పరిరక్షణకు మూడవ దశ ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తున్నామన్నారు. మూసి వేసిన విద్యాధరపురం, గుంటూరు-2, నెల్లూరు-2, మంగళం నాలుగు డిపోలను వెంటనే పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు ఆపరేటర్లకు అప్పగిస్తోన్న విద్యుత్ బస్సు టెండర్లను నిలుపుదల చేయాలన్నారు. ఆగస్టు 3న ఉద్యోగులతో సంతకాలతో కూడిన వినతిపత్రాలు కలెక్టర్లకు, 7,8 తేదీల్లో అన్నీ ఉద్యోగ, విద్యార్థి , యువజన సంఘాల మద్దతు కోరుతూ వినతిపత్రాలను అందిస్తామన్నారు. 17, 18 తేదీల్లో అన్నీ డిపో, యూనిట్ల వద్ద నల్లబాడ్జీలు ధరించి భారీ స్థాయిలో రిలే నిరహారదీక్షలు, 28న అన్నీ జిల్లాల్లో జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయాల వద్ద మహాధర్నాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్ టిసి జెఎసి కన్వీనర్లు వై.శ్రీనివాసరావు, పలిశెట్టి దామోదరరావు,కో-కన్వీనర్లు పి.వి.రమణారెడ్డి, జి.వి.నరసయ్య, సిహెచ్.సుందరయ్య, ఎస్.వి.శేషగిరిరావు, వై.సూర్య ప్రకాష్ రావు, డి.మాల్యాద్రిలు, కట్టా సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టంచేసే జిఓ 470ను రద్దు చేయాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతులకు నష్టం కలిగించే భూసేకరణ పరిహార విషయంలో ప్రభుత్వం విడుదల చేసిన జి. 470 ని తక్షణమే రద్దు చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె. ప్రభాకర రెడ్డి డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం కింద భూసేకరణ సందర్భంలో పరిహారాన్ని లెక్కించే విషయంలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాల కంటే తక్కువ పరిహారాన్ని నిర్ణయించి అమలు చేస్తోందని గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా దేవరాపల్లి మండలానికి సంబంధించిన రైతులు తమకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం న్యాయంగా ఇవ్వాల్సిన పరిహారంపై హైకోర్టుకు వెళ్ళగా, కోర్టు రైతులకు అనుకూలంగా 2019లో తీర్పునిచ్చిందని తెలిపారు. హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపల్ పట్టణాలు, నగర పంచాయతీలకు 2 కిలోమీటర్లకు లోపల ఉండే భూములకు కేవలం ఐదు శాతం, రెండు నుండి ఐదు కిలోమీటర్ల మధ్యలో ఉండే భూములకు పది శాతం, ఐదు కిలోమీటర్లు దాటి ఉండే భూములకు 25 శాతం ఇచ్చేలా జిఓ 470 ని జారీ చేసిందని పేర్కొన్నారు. ఇది భూములు కోల్పోయే రైతులకు గతంలో ఉన్న 25 శాతం నష్టపరిహారాన్ని పొందే న్యాయమైన హక్కును తిరస్కరిస్తోందని తెలిపారు. ఒకసారి భూమి కోల్పోయిన రైతు ప్రభుత్వం ఇచ్చే పరిహారంతో బయట మార్కెట్లో తిరిగి భూమి కొనగలిగే పరిస్థితిలేదని పేర్కొన్నారు. అటువంటి స్థితిలో రైతులకు న్యాయమైన పరిహారాన్ని అందించి ధైర్యం ఇవ్వాల్సిన ప్రభుత్వం దానికి భిన్నంగా ప్రభుత్వ భూసేకరణలో తక్కువ నష్టపరిహారాన్ని ఇచ్చేందుకు జిఓను తీసుకురావడాన్ని రైతు వ్యతిరేక స్వభావాన్ని వెల్లడిస్తోందని విమర్శించారు. జిఓను 470ను రద్దు చేయకపోతే రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలను చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థి ఉద్యమంపై అసత్యప్రచారం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నీట్ పేపర్ లీక్ కుంభకోణానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థి, యువజన ఉద్యమాన్ని లక్ష్యంగా చేసుకుని బిజెపి నాయకులు, మోడీ అనుకూల మీడియా, సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య పేర్కొన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తప్పుడు ప్రచారం చేస్తున్న యూట్యూబర్లు, బిజెపి అనుకూల సోషల్ మీడియా నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను 'గట్టర్ జనరేషన్'గా వ్యాఖ్యానించిన బిజెపి ఎంపి కంగనా రనౌత్‌పై వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. విద్యార్థులపై కేసుల ఎత్తివేత, నీట్ లీక్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం, విద్యా వ్యవస్థలో సంస్కరణలు చేపట్టడం వంటి డిమాండ్లపై కేంద్రం సానుకూలంగా స్పందించినప్పటికీ, ఇప్పటివరకు అమలులో పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు 16 లక్షల ఎకరాల్లో విత్తనాలు నాటే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి, పి.దుర్గాభవాని, డి.శంకర్ పాల్గొన్నారు.

' సైకోమెట్రిక్ 'ద్వారా విద్యార్థులను అర్థం చేసుకోవాలి

- సమగ్రశిక్ష డైరెక్టర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సైకోమెట్రిక్ టూల్ ద్వారా విద్యార్థుల ఆసక్తులు, సామర్థ్యాలు, వ్యక్తిత్వ లక్షణాలు, కెరీర్ ఆకాంక్షలు, భావోద్వేగ స్థితిని శాస్త్రీయంగా అంచనా వేసి, వారికి సరైన సమయంలో సరైన కెరీర్ మార్గదర్శకత్వం, కౌన్సెలింగ్ అందించవచ్చునని సమగ్ర శిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు అన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్‌లో భాగంగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపి), సైకోమెట్రిక్ టూల్ ప్రమాణీకరణపై రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను గురువారం విజయవాడలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రగతితో పాటు వారి మానసిక ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం, కెరీర్ ప్రణాళికలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రస్తుతం విద్యార్థులు విద్యాపరమైన ఒత్తిడి, పోటీ, ఆందోళన, సామాజిక సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో పాఠశాలలు విద్యాబోధనతో పాటు వారి మెంటల్ హెల్త్‌పై కూడా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న సైకోమెట్రిక్ టూల్ శాస్త్రీయంగా, విశ్వసనీయంగా, విద్యార్థులకు అనుకూలంగా ఉండటంతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సులభంగా అమలు చేసే విధంగా రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అదనపు డైరెక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రూపొందిస్తున్న కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కార్యక్రమం విద్యా వ్యవస్థలో కీలక కార్యక్రమంగా నిలుస్తుందని అన్నారు. ఈ వర్క్‌షాప్‌లో నిపుణులు అందించే సూచనలు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న కార్యక్రమానికి బలమైన పునాదిగా నిలుస్తాయని, ఉపాధ్యాయులు, కౌన్సెలర్లకు శిక్షణ, డిజిటల్ అసెస్‌మెంట్ వ్యవస్థ, పర్యవేక్షణ విధానాల రూపకల్పనలో ఉపయోగపడతాయని చెప్పారు.

జలాశయాలకు పెరుగుతున్న వరద

- గోదావరికి వరద ఉధృతి
- ఆందోళనలో ముంపు మండలాల ప్రజలు
- పోలవరం స్పిల్ వే నుండి దిగువకు 2,13,128 క్యూసెక్కులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జలాశయాలకు వరద పెరుగుతోంది. కృష్ణ ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షానికి దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి నీటి ప్రవాహం మొదలైంది. గురువారం సాయంత్రం ఆరు గంటల సమయానికి ఎగువ జూరాల నుండి విద్యుత్ ఉత్పాదన ద్వారా 38,225 క్యూసెక్కులు, 12 గేట్ల నుండి 47,196 క్యూసెక్కులు కలిపి 85,421 క్యూసెక్కుల నీరు చేరింది. అదే సమయానికి శ్రీశైలం జలాశయం నీటిమట్టం 827.30 అడుగులు ఉండగా పూర్తిస్థాయి 885 అడుగులు నీటి నిల్వ సామర్థ్యం 46.8234 టిఎంసిలు ఉంది. పూర్తిస్థాయి సామర్థ్యం 215.8070 టిఎంసిలు. ప్రస్తుతం తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం కుడి గట్టు జలవిద్యుత్ కేంద్రంలో ఉత్పత్తిని నిలిపివేశారు.

పోలవరంలో గోదావరి నీటిమట్టం అనూహ్యంగా పెరిగింది. రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉపనదుల జలాలు గోదావరిలో కలుస్తుండడంతో ప్రాజెక్టులో నీటిమట్టం పెరిగింది. ప్రాజెక్టు స్పిల్ వేలోకి వస్తున్న వరద జలాలను 48 గేట్ల నుండి జలవనరుల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు స్పిల్ వే నుండి 2,13,128 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేసినట్లు ఎస్ఇ రామచంద్రరావు తెలిపారు. స్పిల్ వే ఎగువన 29,250 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన 28.300 మీటర్లు నీటిమట్టం నమోదైంది.

గోదావరిలో పెరిగిన నీటి ప్రవాహం

ఆందోళనలో ముంపు మండలాల ప్రజలు

భద్రాచలంలో బుధవారం 19 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతూ గురువారం 29 అడుగులకు చేరుకుంది. దీంతో ఏలూరు జిల్లాలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. గోదావరి వరద మరో నాలుగు అడుగులు పెరిగితే కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్ వేపైకి వరద నీరు చేరుతుంది. దీంతో వాగు అవతల ఉన్న 15 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉంది.

ఎగువన నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పోలవరం జిల్లాలోని గోదావరి, శబరి నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశా ప్రాంతాల్లో కురుస్తున్న కొండపోత వర్షాల కారణంగా వరద నీరు భారీగా వచ్చి శబరి నదిలో చేరుతుండటంతో నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. కూనవరం ప్రాంతంలో శబరి ఉధృతంగా ప్రవహిస్తోంది. గురువారం సాయంత్రం 4:30 గంటల సమయానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 29 అడుగులకు చేరింది. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పోలవరం ముంపు మండలాల్లో వ్యవసాయ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. భద్రాచలం వద్ద గురువారం అర్ధరాత్రి సమయానికి వరద ప్రవాహం 35 అడుగులకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరి, శబరి క్రమేపీ పెరుగుతుండటంతో విఆర్.పురం, కూనవరం, చింతూరు, ఎటపాక మండలాల్లోని ముంపు ప్రాంతాల వాసుల్లో భయాందోళన మొదలైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. జర్జుల పంచాయతీలోని బొడిలిగూడ గ్రామంలో పలువురి గిరిజనుల నివాస గృహాల గోడలు గురువారం వర్షానికి కూలిపోయాయి.

చట్ట ప్రకారమే భూసేకరణ జరగాలి

ప్రజాశక్తి, అమరావతి:

రాజధాని అమరావతి పరిధిలోని పెనుమాక గ్రామంలో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం కోసం భూముల స్వాధీనంపై దాఖలైన అప్పీల్‌లో హైకోర్టు గురువారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఏ వ్యక్తిగత ఆస్తిని చట్టబద్ధమైన విధానాన్ని అనుసరించకుండా ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదని స్పష్టం చేసింది. భూమి విస్తీర్ణం ఎంత చిన్నదైనా రాజ్యాంగం కల్పించిన ఆస్తి హక్కు వర్తిస్తుందని తెలిపింది.2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములు సేకరించే అధికారంను ప్రభుత్వం కలిగి ఉన్నప్పటికీ, ఆ చట్టం నిర్దేశించిన విధివిధానాలను తప్పనిసరిగా ప్రభుత్వం పాటించాలని హైకోర్టు పేర్కొంది. చట్ట ప్రకారం అంటే కేవలం అధికారం ఉండటం మాత్రమే కాకుండా, చట్టంలో పేర్కొన్న ప్రక్రియను పూర్తిగా అనుసరించడమని వివరించింది. భూసేకరణ సమయంలో చట్టపరమైన విధానాలు పాటించలేదన్న పిటిషనర్ల వాదనను ఈ దశలో తోసిపుచ్చలేమని ధర్మాసనం పేర్కొంది. ఆ అంశాలను ప్రధాన రిట్ పిటిషన్ విచారణలో పరిశీలించాల్సి ఉంటుందని తెలిపింది. అప్పటి వరకు అప్పీలుదారు చోడిశెట్టి నిర్మలతకు చెందిన భూమిపై గతంలో జారీ చేసిన యథాతథ స్థితి ఉత్తర్వులు కొనసాగుతాయని వెల్లడించింది. మధ్యంతర పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసిన వారంలోపు విచారణ పూర్తి చేసి నిర్ణయం తీసుకోవాలని సింగిల్ జడ్జిని ఆదేశించింది.పెనుమాక గ్రామంలోని సర్వే నంబర్ 39/2లోని 65 సెంట్ల భూమిని స్వాధీనం చేసుకోవడాన్ని సవాలు చేస్తూ నిర్మలత హైకోర్టును ఆశ్రయించారు. తొలుత సింగిల్ జడ్జి మధ్యంతర ఉపశమనం నిరాకరించగా, ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన అప్పీల్‌పై డివిజన్ బెంచ్ ఇప్పటికే యథాతథ స్థితి కొనసాగించాలని ఆదేశించింది. గురువారం ఆ ఉత్తర్వులను పొడిగిస్తూ తదుపరి విచారణకు మార్గం సుగమం చేసింది.

సాయికృష్ణ కేసులో మరో కీలక పరిణామం

- రిత్వికనే తమ న్యాయవాదని ధర్మాసనానికి తెలిపిన తల్లి విజయలక్ష్మి

ప్రజాశక్తి, అమరావతి :

గాదె సాయికృష్ణ అదృశ్యం, అనంతరం వెలుగులోకి వచ్చిన లాకప్ డెత్ వ్యవహారానికి సంబంధించిన హెబియస్ కార్పస్ పిటిషన్, సిబిఐ దర్యాప్తు కోరుతూ దాఖలైన అనుబంధ పిటిషన్ల విచారణలో గురువారం హైకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తన తరఫున న్యాయవాదిగా కోగంటి రిత్వికనే కొనసాగిస్తానని, జి.వాసుదేవుడికి తాను ఎలాంటి వకాలత్ ఇవ్వలేదని సాయికృష్ణ తల్లి గాదె విజయలక్ష్మి స్వయంగా ధర్మాసనం ఎదుట హాజరై స్పష్టం చేశారు. దీంతో విజయలక్ష్మి తరఫున వాదనలు వినిపించేందుకు అనుమతించాలని వాసుదేవుడు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. విచారణకు వ్యక్తిగతంగా హాజరైన విజయలక్ష్మి మాట్లాడుతూ తనకు తెలియకుండా కొన్ని ఖాళీ కాగితాలపై సంతకాలు తీసుకుని వాసుదేవుడు తన తరఫున పిటిషన్ దాఖలు చేశారని, అందుకు తనకు ఎలాంటి సంబంధం లేదని ధర్మాసనానికి వివరించారు. ఈ వాదనను నమోదు చేసిన ధర్మాసనం, సిబిఐ దర్యాప్తు కోరుతూ దాఖలైన అనుబంధ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని విజయలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు వినిపించాలని రిత్వికను ఆదేశించింది. ఇందుకు ఆమె గడువు కోరడంతో విచారణను పది రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరీ, జస్టిస్ చింతలపూడి పురుషోత్తం కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

కాగా, ఈ కేసులో ముందుగా సాయికృష్ణ అదృశ్యంపై విజయలక్ష్మి హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. తరువాత లాకప్ డెత్ ఆరోపణల నేపథ్యంలో సిబిఐ దర్యాప్తు కోరుతూ మరో అనుబంధ పిటిషన్ కూడా దాఖలైంది. ఈ రెండు పిటిషన్లను ముందుగా న్యాయవాది కేవీ ఆదిత్య చౌదరి దాఖలు చేశారు. అనంతరం విజయలక్ష్మి కోగంటి రిత్వికను తన న్యాయవాదిగా నియమించుకుని, సిబిఐ విచారణ కోరుతూ వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు మరో పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఆ పిటిషన్‌లో ప్రధాన పిటిషన్, అనుబంధ పిటిషన్ ఉపసంహరణ అంశాలపై స్పష్టత లేకపోవడంతో గత విచారణలో హైకోర్టు వివరణ కోరింది. అలాగే, విజయలక్ష్మి తనకు వకాలత్ ఇచ్చారని పేర్కొంటూ వాసుదేవుడు మరో పిటిషన్ దాఖలు చేయగా, గురువారం విజయలక్ష్మి స్వయంగా కోర్టుకు హాజరై రిత్వికనే తన న్యాయవాదిగా కొనసాగిస్తానని స్పష్టం చేశారు.

ఎన్‌టిఆర్ విదేశీ విద్యాధరణకు రూ.20 కోట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వెనుకబడిన తరగతుల (బిసి) విద్యార్థులు విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు అమలు చేస్తున్న ఎన్‌టిఆర్ విదేశీ విద్యాధరణ పథకానికి ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు బిసి సంక్షేమ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత బడ్జెట్ అంచనాల్లో కేటాయించిన నిధుల నుంచి త్రైమాసిక వ్యయ నియంత్రణకు సడలింపు ఇస్తూ ఈ మొత్తాన్ని విడుదల చేయడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నిధులను లబ్ధిదారులకు పంపిణీ చేసే బాధ్యతను బిసి సంక్షేమ శాఖ డైరెక్టర్ అప్పగించారు.

గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ కార్యాలయం : 6వ అంతస్తు, బి వింగ్, గంగా ట్రూనోవా, రోహిణి, పుణె, మహారాష్ట్ర-411014. ప్రాంతీయ కార్యాలయం: డోర్ నంబర్: 48-6-23, శ్రీరామ్ సాయి గాయత్రి కాంప్లెక్స్, శ్రీనగర్ కాలనీ, రామ టాకీస్ రోడ్ దగ్గర, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ - 530016

ఇ-వేలం - విక్రయ నోటీసు సర్ఫాసి యాక్ట్ క్రింద సెక్యూర్డ్ ఆస్తుల విక్రయం

[illegible] https://www.bankeauctions.com [illegible] www.grihumhousing.com

క్ర. సం.	ప్రతివాది పేరు, ఋణ ఖాతా నెం.	డిమాండ్ నోటీసు తేదీ మరియు బకాయి మొత్తం	స్వాధీన స్వభావం	ఆస్తి వివరాలు	రిజర్వు ధర	ఈఎండి (ఆర్‌పి 10 శాతం)	ఈఎండి సమర్పణ తేదీ	బిడ్ పెంపుదల	ఇ-వేలం తేదీ సమయం	వేలం తేదీ	[illegible]
1.	లోన్ నెం.: HL0005410000000 5007553 [illegible]	నోటీసు తేదీ: 09-10-2025 [illegible] 24,45,486/- [illegible] 12.35% [illegible]	భౌతిక	[illegible] 25.02 చదరపు గజాలు [illegible] 20.91 చదరపు మీటర్లు [illegible] 201.66 చదరపు గజాలలో [illegible] 13/2009 [illegible] 2306 [illegible] 302 [illegible] 900 చదరపు అడుగుల [illegible] 80 చదరపు అడుగుల [illegible] 213 [illegible] 231 [illegible] 40 [illegible] 229	రూ. 12,50,000/- (పన్నెండు లక్షల యాభై వేల రూపాయలు మాత్రమే)	రూ. 125000/- (ఒక లక్ష ఇరవై ఐదు వేల రూపాయలు మాత్రమే)	17-08-2026 [illegible]	10,000/-	18-08-2026 [illegible]	18-08-2026 [illegible]	[illegible]

[illegible] Support@bankeauctions.com [illegible] dharani@c1india.com [illegible] https://www.bankeauctions.com & www.grihumhousing.com [illegible]

తేది: 31-07-2026, ప్రదేశం: వైజాగ్ [illegible] గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్